# పోస్టింగ్ ఇచ్చేలోగా మాట నిలబెట్టుకోండి

- '317 జీవో'ను సమీక్షిస్తామని కాంగ్రెస్ హామీ
- త్వరలో 7వేల నర్సింగ్ పోస్టులకు సెలక్షన్ లిస్ట్
- ఆ లోగా తమకు న్యాయం చేయాలని నర్సుల విజ్ఞప్తి

హైదరాబాద్, జనవరి 17 (నమస్తే తెలంగాణ): వైద్యారోగ్యశాఖలో త్వరలో ఏడు వేల నర్సింగ్ పోస్టుల భర్తీకి సెలక్షన్ లిస్టు విడుదలకు ముందే ప్రభుత్వం తన హామీని నిలబెట్టుకోవాలని 317 జీవో ప్రభావిత నర్సింగ్ ఆఫీసర్లు కోరుతున్నారు. కొత్త జోనల్ విధానం అమలులో భాగంగా ఉద్యోగుల విభజనకు గత ప్రభుత్వం '317 జీవో'ను విడుదల చేసిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా అనేకమంది పట్టణాల నుంచి పల్లెలకు, ఇతర జిల్లాలకు వెళ్లిపోయారు. ముఖ్యంగా హైదరాబాద్‌లో స్థిరపడిన కొందరు జిల్లాలకు బదిలీ అయ్యారు. తమకు సొంత ప్రాంతంలో కాకుండా ఇతర జోన్‌లో పోస్టింగ్ ఇచ్చారని సుమారు 350-400 మంది స్టాఫ్‌నర్సులు గతంలోనే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. దూర ప్రాంతాల్లో పోస్టింగ్ ఇవ్వడంతో కుటుంబాలకు దూరంగా ఉండాల్సి వస్తున్నదని, తిరిగి పాత స్థానాలకు పంపించాలని కోరారు. మరోవైపు ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ తన మ్యానిఫెస్టోలో '317 జీవోను సమీక్షిస్తాం' అని హామీ ఇచ్చింది. తాజాగా 7,094 స్టాఫ్‌నర్స్ పోస్టుల భర్తీకి వెరిఫికేషన్ కూడా పూర్తయింది. వీటికి సెలక్షన్ లిస్టు విడుదల చేసేలోగా తమకు న్యాయం చేయాలని అభ్యర్థులు కోరుతున్నారు. కొత్త వారికి పోస్టింగ్స్ ఇస్తే తమ సొంత ప్రాంతంలో ఖాళీలు భర్తీ అవుతాయని, దీంతో వెనక్కి వెళ్లే పరిస్థితి ఉండదని చెప్తున్నారు. కాబట్టి ఆలోగానే ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని కోరుతున్నారు. ఈ మేరకు ఇప్పటికే వైద్యారోగ్య శాఖ అధికారులకు, మంత్రి దామోదర రాజనర్సింహకు వారు వినతి పత్రం ఇచ్చారు.

### ఎన్వోసీ లేకుండానే పరీక్షకు హాజరు

ప్రభుత్వం ఇటీవల స్టాఫ్‌నర్స్ పోస్టుల భర్తీకి నిర్వహించిన పరీక్షకు అనేకమంది 317 జీవో ప్రభావిత స్టాఫ్ నర్సులు కూడా హాజరయ్యారు. సర్వీస్ పోయినా పర్వాలేదని, సొంత జిల్లాలో కొత్త పోస్టింగ్ వస్తుందని వారు భావించారు. ఇందులో సుమారు 200 మంది సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు కూడా హాజరైనట్టు తెలిసింది. అయితే.. సర్వీస్‌లో ఉన్న నర్సులు మళ్లీ ప్రభుత్వ ఉద్యోగానికి దరఖాస్తు చేసే సమయంలో 'ఎన్‌వోసీ' (నో అబ్జక్షన్ సర్టిఫికేట్) సమర్పించాల్సి ఉంటుంది. కానీ 200 మంది 'ఎన్వోసీ' తీసుకోకుండానే సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు హాజరైనట్టు తెలిసింది. దీంతో అర్హులైన ఇతర అభ్యర్థులు ఉద్యోగావకాశాలు కోల్పోతారని ఆందోళన మొదలైంది. పలువురు అభ్యర్థులు మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డుకు (ఎంహెచ్‌ఎస్‌ఆర్బీ) ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో అధికారులు మెరిట్ లిస్ట్‌ను మరోసారి పరిశీలిస్తున్నట్టు సమాచారం. వారిని ఆ జాబితా నుంచి తొలగించి, తుది సెలక్షన్ లిస్ట్ విడుదల చేసేలోగా తమను సొంత జిల్లాలకు పంపాలని 317 జీవో ప్రభావిత నర్సులు కోరుతున్నారు.

### హామీని అమలు చేయండి



ప్రభుత్వం కొత్త నర్సింగ్ ఆఫీసర్లకు పోస్టింగ్ ఇచ్చేలోగానే 317 ప్రభావిత నర్సుల విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకోవాలి. ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీని అమలు చేయాలి. ముందుగా వారిని రీ లొకేట్ చేసి, ఆ తర్వాత మిగతా ఖాళీల్లో కొత్తవారితో భర్తీ చేస్తే న్యాయం జరుగుతుంది.

- లక్ష్మణ్, నర్సింగ్ ఆఫీసర్స్ అసోసియేషన్ ప్రతినిధి

### జోన్ మార్చండి



నేను హైదరాబాద్‌లోనే చదువుకున్నా. ఇక్కడే స్టాఫ్‌నర్స్‌గా ఉద్యోగం చేస్తున్నా. 317 జీవో అమలులో భాగంగా నాకు హైదరాబాద్ జోన్‌కు బదులుగా, జోగులాంబ గద్వాల జోన్ కేటాయించారు. కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో 317 జీవోను సమీక్షిస్తామని హామీ ఇచ్చారు. ఈ మేరకు మా పోస్టులను సమీక్షించి, జోన్ మార్చాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నా.

- హరిత, నర్సింగ్ ఆఫీసర్

## మేడారంలో భక్తుల రద్దీ



వనదేవతలు సమ్మక్క, సారలమ్మలు కొలువైన మేడారం బుధవారం భక్తులతో రద్దీ కన్పించింది. తెలంగాణతోపాటు ఇతర రాష్ట్రాలకు చెందిన భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. జంపన్నవాగులో పుణ్యస్నానాలు ఆచరించి తల్లులకు కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించారు. అనంతరం అమ్మవార్ల గద్దెల వద్దకు చేరుకుని పసుపు, కుంకుమ, ఎత్తుబెల్లం, నూతన వస్త్రాలు, పూలు, పండ్లు సమర్పించి గిరిజన సంప్రదాయ పద్ధతుల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. బుధవారం సుమారు 50 వేలమంది భక్తులు వచ్చినట్టు అధికారులు అంచనా వేశారు. - తాడ్వాయి

# మేడారం జాతరకూ మహిళలకు ఉచిత బస్సు

- మహా జాతరను విజయవంతం చేస్తాం
- మంత్రులు కొండా సురేఖ, సీతక్క

ములుగు, జనవరి 17 (నమస్తేతెలంగాణ): మేడారం మహాజాతరకు వచ్చే మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కొనసాగుతుందని దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క తెలిపారు. మేడారం జాతర నిర్వహణ కోసం ప్రభుత్వం రూ.75 కోట్లు మంజూరు చేసి భక్తుల సౌకర్యార్థం అభివృద్ధి పనులను చేపట్టిందని అన్నారు. పనుల విషయంలో నాణ్యతపై రాజీ పడేది లేదని స్పష్టం చేశారు. బుధవారం ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారం గ్రామంలో మేడారం మహా జాతరపై వారు అధికారులతో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ముందుగా మేడారం సమ్మక్క-సారలమ్మలకు మొక్కులు చెల్లించి పూజలు చేశారు. అనంతరం మంత్రు లు మీడియాతో మాట్లాడుతూ.. మేడారం ప్రాంతంలో వరదల కారణంగా భారీ నష్టం వాటిల్లిందని, వాటి కోసం మేడారం నిధులతో అభివృద్ధి పనులు జరుపుతున్నామని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అభివృద్ధి కోసం రూ.75 కోట్లు విడుదల చేయగా టెండర్ల ద్వారా పనులు చేపట్టినట్టు తెలిపారు. మరిన్ని నిధుల కోసం ప్రభుత్వాన్ని కోరగా రూ.35 కోట్లను మంజూరు చేసిందని చెప్పారు. శాశ్వత పనులు జరిపించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం దృఢ నిశ్చయంతో ఉన్నదని తెలిపారు. అభివృద్ధి పనుల విషయంలో కాంట్రాక్టర్లకు వంత పాడే అధికారులపై చర్యలు చేపడుతామని హెచ్చరించారు.



సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క. చిత్రంలో మంత్రి కొండా సురేఖ

## గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణాన్ని ఆపండి

- రైతుల డిమాండ్.. ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసన

పరకాల, జనవరి 17: తమ భూములను బలవంతంగా తీసుకుని నిర్మిస్తున్న గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణాన్ని వెంటనే నిలిపివేయాలని బాధిత రైతులు డిమాండ్ చేశారు. బుధవారం హనుమకొండ జిల్లా పరకాల పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో ఎదుట వారు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణానికి పచ్చని పంటపొలాలను కేంద్ర ప్రభుత్వం గుంజుకుంటుందని, ఈ విషయమై హైకోర్టులో కేసు నడుస్తున్నట్టు తెలిపారు. కాని అధికారులు హైకోర్టులో కేసు విషయాన్ని పట్టించుకోకుండా రైతుల భూములను గుంజుకునే ప్రయత్నం చేస్తున్నదని ఆరోపించారు. అధికారులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కోర్టు కేసు పూర్తయ్యే వరకు రైతుల భూములు విషయంలో అధికారులు ఆగాలని, లేనిపక్షంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై పోరాటం చేస్తామని హెచ్చరించారు.

## మూడు కుటుంబాల బహిష్కరణ

ఇబ్రహీంపట్నం, జనవరి 17: గ్రామ దేవతలు కొలువుదీరిన ప్రదేశాలకు వెళ్లేందుకు అడిగినంత వెడల్పుతో దారికి స్థలం ఇవ్వని కారణంగా 3 కుటుంబాలను గ్రామాభివృద్ధి కమిటీ సాంఘిక బహిష్కరణ చేసింది. ఈ ఘటన జగిత్యాల జిల్లా ఇబ్రహీంప ట్నం మండలం తిమ్మాపూర్‌లో బుధవారం ఆలస్యంగా వెలుగుచూసింది. తిమ్మాపూర్ శివారులోని గ్రామ దేవతల వద్దకు ముగ్గురు రైతుల పొలాల్లో నుంచి వెళ్లాలి. అమ్మవార్ల దగ్గరికి వెళ్లేందుకు దారి కోసం సదరు రైతుల పొలాల్లోంచి 18 అడుగుల స్థలం ఇవ్వాలని వీడీసీ సభ్యులు హుకుం జారీ చేశారు. 18 అడుగుల స్థలం ఇవ్వలేమని, నాలుగు అడుగులు మాత్రం ఉచితంగా ఇస్తామని రైతులు తేల్చి చెప్పారు. దీనికి ఒప్పుకోని వీడీసీ, ఆ మూడు కుటుంబాలను గ్రామం నుంచి సాంఘిక బహిష్కరణ చేసింది. ఆ కుటుంబాల్లోని వ్యక్తులతో గ్రామస్థులెవరూ మాట్లాడొద్దని, మాట్లాడితే రూ.25 వేల జరిమానా విధిస్తామని, వారి పొలాల్లో కూలీకి వెళ్లవద్దని ఆంక్షలు విధించారు. మూడు కుటుంబాల పెద్దలు ఈ నెల 11న ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేయగా, వీడీసీ సభ్యులపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై ఉమాసాగర్ తెలిపారు.

### విద్యుత్తు షాక్‌తో రైతు మృతి



శ్రీనివాసరావు (ఫైల్)

చండ్రుగొండ, జనవరి 17 : విద్యుత్తు షాక్‌తో రైతుమృతి చెందిన ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చండ్రుగొండ మండలంలో బుధవారం చోటుచేసుకున్నది. గ్రామస్థుల కథనం ప్రకారం.. రావికంపాడు గ్రామానికి చెందిన రైతు కుక్కల శ్రీనివాసరావు (50) కరెంటు మోటర్‌తో నీరు పెట్టేందుకు బుధవారం ఉదయం పొలం వద్దకు వెళ్లాడు. విద్యుత్తు స్తంభానికి గల సపోర్టింగ్ వైరు తెగి ఉండటాన్ని గమనించాడు. దానిని పొలం గట్టుపై వేసేందుకు శ్రీనివాసరావు ప్రయత్నించగా దానికి కరెంటు సరఫరా కావడంతో షాక్ తగిలి అక్కడికక్కడే మృతిచెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై మాచినేని రవి తెలిపారు.

# మహిళకు కాంగ్రెస్ నేత వేధింపులు

- కరీంనగర్ కలెక్టరేట్ ఎదుట ఆత్మహత్యాయత్నం
- మంగళవారం రాత్రి పురుగుల మందు తాగిన భర్త
- ఎంపీపీ మల్లారెడ్డిని అరెస్టు చేయాలని డిమాండ్

కరీంనగర్ కలెక్టరేట్, జనవరి 17: అధికార కాంగ్రెస్ పార్టీ నాయకుడి వేధింపులు భరించలేక ఓ మహిళ బుధవారం కలెక్టరేట్ ఎదుట ఆత్మహత్యాయత్నం చేసింది. కరీంనగర్ జిల్లా గన్నేరువరం మండలం హన్మాజిపల్లికి చెందిన కూరపాటి గీత ఒంటిపై పెట్రోల్ పోసుకుంటుండగా.. పోలీసులు అడ్డుకున్నారు. గన్నేరువరం ఎంపీపీ లింగాల మల్లారెడ్డి వేధింపులేనని తన ఆత్మహత్యాయత్నానికి కారణం అంటూ నినాదాలు చేస్తూ బంధువులతో కలిసి కలెక్టరేట్ ఎదుట ఆందోళనకు దిగింది. గన్నేరువరం మండలం హన్మాజిపల్లిలో కూరపాటి సమ్మయ్య గతంలో బీఆర్‌ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడిగా పనిచేశాడు. ప్రస్తుతం ఆయన గ్రామ పంచాయతీ వార్డు సభ్యుడిగా కొనసాగుతున్నాడు. ఎంపీపీ లింగాల మల్లారెడ్డికి ముఖ్య అనుచరుడిగా ఉన్నాడు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో ఎంపీపీ కాంగ్రెస్‌లో చేరి.. సమ్మయ్యను కూడా చేరాలని ఒత్తిడి చేశాడు. దీనిని పట్టించుకోని సమ్మయ్య కొద్దిరోజుల నుంచి రాజకీయాలకు దూరంగా ఉంటూ కిరాణాషాపు నడిపిస్తున్నాడు. తాను చెప్పినట్టు వినకపోతే కుటుంబం మొత్తాన్ని చంపుతానంటూ బెదిరింపులకు గురిచేశాడు. దీంతో జీవితంపై విరక్తి చెందిన సమ్మయ్య మంగళవారం అర్ధరాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడని, ప్రస్తుతం ఆయన కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానలో చావుబతుకుల మధ్య చికిత్స పొందుతున్నాడని కుటుంబసభ్యులు తెలిపారు. తన కుటుంబానికి జరుగుతున్న అన్యాయంపై సమ్మయ్య భార్య గీత బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు వెళ్లగా.. ఎవరూ పట్టించుకోలేదు. చేసేది లేక కలెక్టరేట్ ఎదుట వారి కుటుంబసభ్యులతో కలిసి ఆందోళనకు దిగింది. ఔట్‌పోస్టు పోలీసులు వారిస్తుండగా తనవెంట సీసాలో తెచ్చుకున్న పెట్రోల్‌ను తనపై చల్లుకున్నది. వెంటనే పోలీసులు ఆమెపై నీళ్లు చల్లి కాపాడారు. అధికార కాంగ్రెస్ పార్టీ నాయకుడు, ఎంపీపీ లింగాల మల్లారెడ్డి నుంచి తమ కుటుంబానికి హాని ఉన్నదని, తమకు రక్షణ కల్పించి, తన భర్తకు మెరుగైన వైద్యం అందించాలని, మల్లారెడ్డిపై కఠిన చర్యలు తీసుకోవాలని బాధితురాలు గీత, ఆమె బంధువులు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కరీంనగర్‌లోని దవాఖానలో చికిత్స పొందుతున్న బాధితుడు సమ్మయ్యను ప్రణాళికా సంఘం మాజీ ఉపాధ్యక్షుడు బీ వినోద్‌కుమార్, మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు పరామర్శించారు.



కరీంనగర్ కలెక్టరేట్ ఎదుట ఒంటిపై పెట్రోల్ పోసుకుంటున్న కూరపాటి గీతను అడ్డుకుంటున్న పోలీసులు

## బడిబయటి పిల్లలపై సర్వే పొడిగింపు

హైదరాబాద్, జనవరి 17 (నమస్తే తెలంగాణ): తెలంగాణ సమగ్రశిక్ష ఆధ్వర్యంలో బడి బయట ఉన్న పిల్లలపై నిర్వహిస్తున్న సర్వేను 31 వరకు పొడిగించారు. ఈ మేరకు డీఈవోలకు పాఠశాల విద్యాశాఖ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. బడిబయట ఉన్న చిన్నారుల వివరాలను సేకరించి వాటిని ప్రబంధ్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించింది.

## బీఆర్‌ఎస్ కార్యకర్తపై కాంగ్రెస్ నేతల దాడి

- సొంత వాహనానికి బీఆర్‌ఎస్ జెండా కట్టాడని చితకబాదిన వైనం
- మనస్తాపంతో ఇల్లు అమ్ముతానని సోషల్ మీడియాలో బాధితుడి పోస్టు

మహబూబ్‌నగర్, జనవరి 17 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): తన బొలెరో వాహనానికి బీఆర్‌ఎస్ జెండా కట్టుకున్నాడని ఆ పార్టీ కార్యకర్తపై కాంగ్రెస్ నాయకులు దాడి చేశారు. ఈ ఘటన వనపర్తి మున్సిపాలిటీ పరిధిలోని నర్సింగాయపల్లిలో బుధవారం చోటుచేసుకున్నది. 'ఈ నెల 15న నా బొలెరో వాహనానికి బీఆర్‌ఎస్ జెండా కట్టుకున్నాను. గ్రామానికి చెందిన ఆంజనేయులు, అతడి కొడుకు హరికృష్ణ.. బొలెరో వాహనానికి ఓడిపోయిన పార్టీ జెండా ఎందుకు కట్టావు అంటూ బూతులు తిట్టారు. బీఆర్‌ఎస్‌పై ఇష్టంతో జెండాను కట్టున్నానని చెప్పడంతో నన్ను చితకబాదారు' అని బాధితుడు కురుమూర్తి వాపోయాడు. ఈ ఘటనతో మనస్తాపం చెందిన కురుమూర్తి.. 'కాంగ్రెస్ నాయకుల దౌర్జన్యాలు చూస్తూ ఉండలేకపోతున్నాను.. ఇల్లు అమ్ముకొని వెళ్తాను.. ఎవరైనా నా ఇల్లు కొనుక్కోవాలి' అని ప్రాధేయపడుతూ సోషల్ మీడియాలో పెట్టిన పోస్ట్ వైరల్‌గా మారింది. కాగా.. నర్సింగాయపల్లికి చెందిన కురుమూర్తిపై ఆయన మేనమామ దాడి చేసిన మాట వాస్తవమేనని, బొలెరో వాహనంతో బైక్‌ను ఢీకొట్టినందుకు ఆయనను కొట్టారని ఫిర్యాదు వస్తే.. గ్రామస్థులు ఇరువర్గాల వారికి రాజీ కుదిరించారని గోపాల్‌పేట ఎస్సై వెంకటేశ్వర్లు 'నమస్తే తెలంగాణ' ప్రతినిధికి వివరించారు.

### తాటి చెట్టుపై గీత కార్మికుడు మృతి

మోత్కూరు, జనవరి 17 : అదుపు తప్పి జారడంతో ఓ గీత కార్మికుడు తాటి చెట్టుపైనే వేలాడుతూ ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఘటన యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మున్సిపాలిటీ పరిధిలోని రాజన్నగూడెంలో చోటుచేసుకున్నది. రాజన్న గూడేనికి చెందిన గీత కార్మికుడు సుదగాని లక్ష్మయ్య (70) బుధవారం ఉదయం గ్రామంలోని తాటి చెట్టు ఎక్కాడు. చెట్టుపై మెర పెడుతుండగా జారి కిందకు వేలాడాడు. నడుముకు మోకు, ముస్తాదు ఉన్నా పైకి లేవలేకపోయాడు. పోలీసులు క్రేన్ సాయంతో కిందికి దింపారు. గంటకుపైగా వేలాడి అలాగే ఉండటంతో స్పృహ కోల్పోయాడు. వెంటనే సీపీఆర్ చేశారు. ఊపిరి లేకపోవడంతో 108 వాహనంలో స్థానిక ప్రైవేట్ దవాఖానకు తరలించి పరీక్షించడంతో లక్ష్మయ్య మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఖనిలో కల్లు తాగి ఇద్దరి మృతి

ఫర్టిలైజర్‌సిటీ, జనవరి 17: పెద్దపల్లి జిల్లా గోదావరిఖని అడ్డగుంటపల్లిలో బుధవారం రాత్రి కల్లు తాగి ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. గోదావరిఖనిలోని ఎన్టీఆర్ నగర్‌కు చెందిన మామిడి రమేశ్(50), నాంపల్లి నవీన్(30) దుర్గానగర్‌లోని ఓ ప్రవేటు కాంట్రాక్టర్ వద్ద కూలి పనులు చేస్తారు. సాయంత్రం పని ముగించుకొని అడ్డగుంటపల్లిలోని కల్లు డిపోలో కల్లు తాగారు. తిరిగి వస్తూ ఇరువురు స్థానిక ఆర్యవైశ్య భవన్ సమీపంలో కిందపడ్డారు. నవీన్ సోదరుడు అంజి వారిని తీసుకెళ్లేందుకు రాగా, అప్పటికే మృతి చెందారు. అయితే కల్తీ కల్లు తాగడం వల్లే మృతి చెందినట్టు మృతుల బంధువులు ఆరోపిస్తున్నారు.

## అదనపు వనరుల సమీకరణపై దృష్టి

- పెండింగ్ బకాయిలు సమకూర్చుకునేలా కార్యాచరణ
- వివిధ శాఖల అధికారులతో భట్టి సమీక్ష

హైదరాబాద్, జనవరి 17 (నమస్తే తెలంగాణ): అదనపు వనరుల సమీకరణపై దృష్టి సారించాలని వివిధ శాఖల అధికారులకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సూచించారు. బుధవారం సచివాలయంలో ఆర్థికశాఖ ప్రధాన ప్రత్యేక కార్యదర్శి రామకృష్ణారావుతో కలిసి పరిశ్రమలు, గనులు భూగర్భ వనరులు, హౌజింగ్ కార్పొరేషన్, హౌజింగ్ బోర్డ్, హెచ్‌ఎండీఏ, టీఎస్‌ఐఐసీ ఉన్నతాధికారులతో అదనపు వనరుల సమీకరణపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా శాఖల వారీగా ప్రభుత్వానికి రావాల్సిన పెండింగ్ బకాయిలపై చర్చించారు. పరిశ్రమలు, టీఎస్‌ఐఐసీ, హెచ్‌ఎండీఏ శాఖల పరిధిలో ఇప్పటివరకు జరిగిన భూ అమ్మకాలు, తద్వారా ప్రభుత్వానికి సమకూరిన ఆదాయం, ఇంకా రావాల్సిన బకాయిలు తదితర అంశాలపై సమగ్రంగా సమీక్షించారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ పెండింగ్ బకాయిలు సమకూర్చుకొనేందుకు కార్యాచరణ రూపొందించి నిధులను రాబట్టాలని సూచించారు. ప్రతి పైసాను ఎట్టిపరిస్థితుల్లో వదలొద్దని స్పష్టం చేశారు. ఇండస్ట్రియల్ పార్కులను వినియోగంలోకి తీసుకురావడానికి అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తూప్రాన్ ఇండస్ట్రియల్ పార్కుకు ప్రభుత్వం 325 ఎకరాలు కేటాయించగా, 139 ఎకరాలు అప్పగించారని, మిగతా భూమిని సేకరించాల్సి ఉన్నదని తెలిపారు. పరిశ్రమల శాఖ పరిధిలో జాయింట్ వెంచర్స్ నుంచి ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయ వనరులపై ఆరా తీసి, సమగ్ర నివేదిక అందించాలని ఆదేశించారు. హౌజింగ్‌బోర్డ్ చేపట్టిన 12 జాయింట్ వెంచర్స్ ప్రాజెక్టులో ఆరు ప్రాజెక్టులు పూర్తయ్యాయని అధికారులు వివరించారు. ఈ ప్రాజెక్టు నుంచి ప్రభుత్వానికి రూ. 955 కోట్లు రావాల్సి ఉండగా, రూ.430 కోట్లు వచ్చాయని తెలిపారు. మిగతా రూ.525 కోట్ల బకాయిలు రాబట్టేందుకు రూపొందించుకున్న కార్యాచరణ ప్రణాళికను వెల్లడించారు. రాయల్టీ ద్వారా రావాల్సిన ఆదాయంలో పెండింగ్ గురించి భట్టి మైనింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇసుక కొరత లేకుండా చూడాలని చెప్పారు. సమావేశంలో గనులు భూగర్భ వనరుల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ మహేశ్‌దత్ ఎక్కా, ఫైనాన్స్ జాయింట్ సెక్రటరీ హరిత, పరిశ్రమలశాఖ డైరెక్టర్ రెహమాన్, హౌజింగ్ కార్పొరేషన్ ఎండీ విజయేంద్ర బోయి, హౌజింగ్ బోర్డు ఎండీ మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు.

## ఏసీబీకి చిక్కిన మున్సిపల్ అధికారి

- 8 వేలు లంచం తీసుకుంటూ దొరికిన ఆర్‌ఐ వెంకట్రావు

సదాశివపేట, జనవరి 17: లంచం తీసుకుంటూ మున్సిపల్ అధికారి ఏసీబీ అధికారులకు దొరికాడు. సంగారెడ్డి జిల్లా సదాశివపేటలోని హౌసింగ్‌బోర్డులోగల ఓ వెంచర్‌లో ఇంటి నంబర్ కేటాయించాలని ఆకుల సంగమేశ్వర్ అనే వ్యక్తి గతనెల 25న మున్సిపల్ ఆర్‌ఐ వెంకట్రావును కోరారు. అందుకు ఆయన రూ.10 వేలు డిమాండ్ చేశాడు. ఈ మేరకు బాధితుడి కుమారుడు శివకుమార్ ఆర్‌ఐతో ఒప్పందం చేసుకున్నాడు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో శివకుమార్ నుంచి ఆర్‌ఐ రూ.8 వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. కేసు నమోదు చేసిన అధికారులు సదరు మొత్తాన్ని స్వాధీనం చేసుకొని, ఆర్‌ఐతోపాటు ఆయనకు సహకరించిన ఔట్ సోర్సింగ్ ఉద్యోగి వేణుగోపాల్‌శర్మను కూడా అదుపులోకి తీసుకున్నారు.

# ఫిబ్రవరిలో మెగా డీఎస్సీ

- త్వరలో కల్యాణలక్ష్మి చెక్కులతో పాటు తులం బంగారం అందజేత
- నల్లగొండలో మంత్రి కోమటిరెడ్డి

నల్లగొండ ప్రతినిధి, జనవరి 17(నమస్తే తెలంగాణ): ఫిబ్రవరిలో మెగా డీఎస్సీ ప్రకటించి ఆ వెంటనే ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేస్తామని ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. టీఎస్‌పీఎస్సీని ప్రక్షాళన చేసి గ్రూప్-2 పరీక్షను కూడా నిర్వహిస్తామని పేర్కొన్నారు. పోటీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ప్రకటించారు. రాబోయే క్యాబినెట్ సమావేశంలో చర్చించి త్వరలోనే కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులతోపాటు తులం బంగారం కూడా అందజేస్తామని వెల్లడించారు. బుధవారం నల్లగొండ పట్టణంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో మంత్రి కోమటిరెడ్డి పాల్గొన్నారు. స్థానిక ఆర్డీవో కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఇకనుంచి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులతోపాటు పెన్షన్లు, ఇందిరమ్మ ఇండ్లు, ఇతర ప్రభుత్వ పథకాల్లో అధికారులే అర్హులను పారదర్శకంగా ఎంపిక చేస్తారని చెప్పారు. త్వరలోనే ఇందిరమ్మ ఇండ్లు నిర్మించడానికి స్థలాలను గుర్తిస్తామని తెలిపారు.



షాదీముబారక్ చెక్కు అందజేస్తున్న మంత్రి వెంకట్‌రెడ్డి. చిత్రంలో కలెక్టర్ హరిచందన

## 'కాళేశ్వరం'పై మళ్లీ విజిలెన్స్ తనిఖీలు

మహదేవపూర్ (కాళేశ్వరం), జనవరి 17: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని కాళేశ్వరం ప్రాజెక్టుపై విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు బుధవారం తనిఖీలు నిర్వహించారు. ఈ నెల 9న తనిఖీలు చేసి పలు రికార్డులను స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే. బుధవారం కాళేశ్వరంలోని హరితహోటల్‌లో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సమావేశమై పలు అంశాలపై చర్చించారు. అనంతరం అక్కడి నుంచి మేడిగడ్డ బరాజ్‌కు వెళ్లి ఇంజినీరింగ్ కార్యాలయంలో బరాజ్‌కు సంబంధించిన పలు రికార్డులను క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించినట్టు సమాచారం.


# రాష్ట్ర బీజేపీకి ఇన్‌చార్జిలెందరో!

- ఇప్పటికే ముగ్గురు.. త్వరలో మరొకరు
- అయోమయంలో క్యాడర్
- బీజేపీఎల్పీ నేత ఎన్నికపై సస్పెన్స్

హైదరాబాద్, జనవరి 17 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర బీజేపీలో ఒకటికి నలుగురు ఇన్‌చార్జిలు ఉండటంతో ఏ సమస్య మీద ఎవరిని కలవాలో తెలియని అయోమయ పరిస్థితిని ఆ పార్టీ కార్యకర్తలు ఎదుర్కొంటున్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కాకుండా ఇప్పటికే ముగ్గురు ఇన్‌చార్జిలను ఢిల్లీ పెద్దలు నియమించారు. లోక్‌సభ ఎన్నికల కోసం మరో ఇన్‌చార్జిని నియమించే అవకాశం ఉన్నదని భావిస్తున్నారు. దీనికి తోడు బీఎల్ సంతోష్ ప్రత్యక్ష పర్యవేక్షణ కొనసాగుతున్నది. బీజేపీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జిగా తరుణ్‌చుగ్ ఎప్పటి నుంచో కొనసాగుతున్నారు. ఆయనకు అదనంగా జాతీయ ప్రధాన కార్యదర్శి సునీల్‌బన్సల్‌ను మరో ఇన్‌చార్జిగా 2022 ఆగస్టులో నియమించారు. తరుణ్‌చుగ్‌కు రాజకీయ వ్యవహారాలు, సునీల్‌బన్సల్‌కు సంస్థాగత వ్యవహారాలు అప్పగించారు. కానీ సునీల్‌బన్సల్ ఎక్కువగా రాజకీయ అంశాలపైనే ఫోకస్ పెడుతున్నారు. ఫలితంగా ఆరెస్సెస్, అనుబంధ సంఘాల నేతలు తమ సమస్యలను ఎవరితో చెప్పుకోవాలో తెలియని పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. తాజాగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా చంద్రశేఖర్‌ను నియమించారు. ఆయన కూడా సంస్థాగత వ్యవహారాలు చూసుకుంటారని పేర్కొన్నారు. అలాంటప్పుడు సునీల్‌బన్సల్‌తో పనేముందని కొందరు ప్రశ్నిస్తున్నారు. సునీల్‌బన్సల్‌కు యువమోర్చా బాధ్యతలు అప్పగించడంతో ఆయన రాష్ట్ర ఇన్‌చార్జిగా ఉన్నట్టా? లేనట్టా? అని రాష్ట్ర నేతలు చర్చించుకుంటున్నారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల ఇన్‌చార్జిగా ప్రకాశ్‌జవదేకర్‌ను గత ఏడాది జూలైలో నియమించారు. అసెంబ్లీ ఎన్నికలు పూర్తయిన నేపథ్యంలో ఆయన పదవీకాలం ముగిసినట్టే అని బీజేపీ వర్గాలు చెప్తున్నాయి. కానీ స్పష్టత లేదు. ఇప్పుడు లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఢిల్లీ అధిష్ఠానం తెలంగాణకు ప్రత్యేకంగా ఇన్‌చార్జిని నియమిస్తుందని పార్టీ నేతలు చెప్తున్నారు. రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు ఉండగా ఇంతమంది ఇన్‌చార్జిలను ఎందుకు నియమిస్తున్నారో అర్థం కావడం లేదని కార్యకర్తలు వ్యాఖ్యానిస్తున్నారు.

### బీజేపీఎల్పీ నేత ఎంపికపై మల్లగుల్లాలు

బీజేపీ శాసనసభాపక్ష (బీజేపీఎల్పీ) నేతగా ఎవరిని ఎంచుకోవాలనే విషయంలో ఆ పార్టీ నాయకత్వం ఎటూ తేల్చుకోలేకపోతున్నది. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఆ పార్టీకి చెందిన ఎనిమిది మంది ఎమ్మెల్యేలుగా ఎన్నికైనప్పటికీ, సీనియర్లు ఎవ్వరూ విజయం సాధించలేదు. రాజాసింగ్ ఒక్కరే బీజేపీ తరఫున మూడోసారి ఎన్నికయ్యారు. దీంతో తనకే ఎల్పీ లీడర్‌గా అవకాశం ఇవ్వాలని రాజాసింగ్ పట్టుబడుతున్నారు. రాజాసింగ్ వ్యవహార శైలిపై రాష్ట్ర నాయకత్వంతోపాటు ఢిల్లీ అధిష్ఠానానికి సానుకూల అభిప్రాయం లేదు. తరుచూ వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం, తెలుగులో స్పష్టంగా మాట్లాడలేకపోవడం రాజాసింగ్‌కు మైనస్‌గా మారింది. దీంతో నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి పేరు తెరపైకి వచ్చింది. అయితే రాజాసింగ్ అలిగారు. రాష్ట్ర పార్టీ ప్రధాన కార్యాలయంలో సమావేశం మధ్య నుంచే వెళ్లిపోయి ఫోన్ స్విచ్చాఫ్ చేసుకున్నారు. దీంతో రాష్ట్ర నాయకత్వం ఎల్పీ నేత ప్రకటనను వాయిదా వేసింది. తాజాగా ఈ రేసులో కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి పేరు వినిపిస్తున్నది. సోషల్‌మీడియాలో ఆయనకు ఫాలోయింగ్ ఉండటంతో రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో తమకు కలిసి వస్తుందని బీజేపీ పెద్దలు భావిస్తున్నట్టు సమాచారం. ఎమ్మెల్యేగా మొదటిసారే గెలిచినప్పటికీ, గతంలో ప్రజాప్రతినిధిగా పనిచేసిన అనుభవం ఉండటం, వాక్చాతుర్యం వంటి అంశాలు రమణారెడ్డికి అనుకూలంగా మారాయి. చివరకు అధిష్ఠానం ఎవరిని ఖరారు చేస్తుందనేది ఆసక్తికరంగా మారింది.



ఆంధ్రనగర్‌లో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి తుమ్మల

# నెలాఖరులోగా 'రైతుబంధు' పూర్తి

- రుణమాఫీ కష్టమైనా చేసి తీరుతాం
- రైతు డిక్లరేషన్‌ను అమలుచేస్తాం
- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల

నందిపేట్, జనవరి 17: ఎన్ని ఇబ్బందులు ఎదురైనా రైతు డిక్లరేషన్ అమలు చేస్తామని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అన్నారు. నెలాఖరులోగా రైతుబంధు ప్రక్రియ పూర్తి చేస్తామని తెలిపారు. ఆర్థికంగా కష్టమైనా రుణమాఫీ ప్రక్రియ కూడా చేపడతామని ఆయన పేర్కొన్నారు. నిజామాబాద్ జిల్లా నందిపేట్ మండలం ఆంధ్రనగర్‌లో ఏర్పాటుచేసిన ఎన్టీఆర్ విగ్రహాన్ని మంత్రి తుమ్మల బుధవారం ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్టీఆర్ శిష్యుడిగా రాజకీయాల్లోకి వచ్చినట్టు తెలిపారు. ఎన్టీఆర్ ఆశయాలకు అనుగుణంగా రైతుల కోసం పని చేస్తానని స్పష్టం చేశారు. ఇప్పటికే రెండు ఎకరాల లోపు భూమి ఉన్న 29 లక్షల మందికి రైతుబంధు డబ్బులు ఖాతాల్లో పడ్డాయని తెలిపారు. మిగతా వారికి ఈ నెలాఖరులో పూర్తి చేస్తామని చెప్పారు. రూ.2 లక్షల పంట రుణం ఒకేసారి మాఫీ చేయడం ప్రభుత్వానికి కష్టమే అయినా, ముఖ్యమంత్రి ఆలోచన, పద్ధతి ప్రకారంగా కొద్దిరోజుల్లోనే రుణమాఫీ చేస్తామని అన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు రానివ్వమని ఎన్టీఆర్ ఆశీస్సులతో రాజకీయాల్లోకి వచ్చిన తాము రైతుల అవసరం కోసం పనిచేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీ చైర్మన్ విఠల్‌రావు, ఎమ్మెల్యేలు పైడి రాకేశ్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, మాజీ మంత్రి మండవ వెంకటేశ్వర రావు పాల్గొన్నారు.